



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

న్యూస్‌రీల్

జిల్లాకోర్టుతో సత్వర న్యాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్‌: జిల్లా ప్రధాన న్యాయస్థానం ఏర్పాటు చేయడం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా కోర్టు ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా జగిత్యాల బార్‌ అసోసియేషన్‌లో శుక్రవారం కేక్‌ కట్‌ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. జడ్జి నీలిమ మాట్లాడుతూ, గతంలో జిల్లాప్రధాన న్యాయస్థానం కరీంనగర్‌లో ఉండటంతో కక్షిదారులు అధిక వ్యయప్రయాసలకు ఓర్చి అంతదూరం వెళ్లి రావాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు జగిత్యాలలోనే జిల్లా ప్రధాన కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా రవాణా భారం తప్పిందని, సమయం కలిసి వస్తోందని చెప్పారు. కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, ఉపాధ్యక్షుడు మహేందర్‌, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్‌: సీఎం కేసీఆర్‌ పాలనలో రాష్ట్రం నూరేళ్ల వెనక్కు వెళ్లిందని, ఆత్మబలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఇందిరాభవన్‌లో జెండా ఆవిష్కరించారు. తహసీల్‌ చౌరస్తా వరకు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్‌ అధినేత్రి సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు గిరినాగభూషణం, విజయలక్ష్మి, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్‌, బొడ్డు లక్ష్మణ్‌, గాజంగి నందయ్య, పుప్పాల అశోక్‌, గుండ మధు పాల్గొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సభ్యులు

ధర్మపురి: గోదావరి హారతి యాత్ర ప్రచార పోస్టర్‌ను శుక్రవారం ధర్మపురి పుణ్యక్షేత్రంలో ఆవిష్కరించారు. బీజేపీ జాతీయ నాయకుడు పాల్వాయి మురళీధర్‌రావు ఆధ్వర్యంలో గోదావరి యాత్ర ఉత్సవ సమితి నేతృత్వంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. ఈనెల 3న బాసరలో ప్రారంభమయ్యే గోదావరిహారతి యాత్ర ఈనెల 5న ధర్మపురి పుణ్యక్షేత్రానికి చేరుకుంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్‌ పిల్లి శ్రీనివాస్‌, సభ్యులు సంగి నర్సయ్య, ఓరుగంటి చంద్రశేఖర్‌, గాజు భాస్కర్‌, స్తంభంకాడి శ్యామ్‌ తదితరులు పాల్గొన్నారు.

బెహరాన్‌లో వేడుకలు



కేక్‌ కట్‌ చేస్తున్న ప్రతినిధులు

రాయికల్‌(జగిత్యాల): ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్‌ సెల్‌ ఆధ్వర్యంలో బెహరాన్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మౌనం పాటించి అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం కేక్‌ కట్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్‌ సెల్‌ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేశ్‌, ప్రధాన కార్యదర్శి కుప్పాల భద్రి, ప్రతినిధులు మగ్గిడి రాజేందర్‌, సుమన్‌, కార్యదర్శులు ఉత్కం కిరణ్‌గౌడ్‌, దేవన్న, కొత్తూరి సాయన్న, చంద్రశేఖర్‌, ఖాసీం, రవి తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్‌







నివాళి అర్పిస్తున్న కలెక్టర్‌ యాస్మిన్‌ బాషా, బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌



కోరుట్లలో ఆకట్టుకున్న ఎన్‌సీసీ పరేడ్‌



తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలకు హాజరైన ప్రముఖులు

అన్నిరంగాల్లో అగ్రగామి

- ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి
- వ్యవసాయంలో పండుగ వాతావరణం
- మెట్టప్రాంతాల్లో జలసిరులు
- ఇంటింటికీ భగీరథ తాగునీరు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌
- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

జగిత్యాల: ప్రజల భాగస్వామ్యంతో జిల్లాను అన్నిరంగాల్లో ముందంజలో ఉంచుతామని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం ఎదుట శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్‌, విద్యాసాగర్‌రావు, కలెక్టర్‌ యాస్మిన్‌ బాషాతో కలిసి తొలుత అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు.. తెలంగాణ ఆవిర్భావానికి ముందు జిల్లాలో 3.45 లక్షల ఎకరాల్లో నికర సాగుభూమి ఉంటే.. అది ఇప్పుడు 4.42 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. తెలంగాణ ఆచరిస్తుంది, దేశం అనుసరిస్తుందని చెప్పుకునే స్థాయికి మనం చేరుకున్నామని, ఇది రాష్ట్ర ప్రజలకు గర్వకారణమన్నారు.

పండుగలా వ్యవసాయం..

- రైతుబంధు ద్వారా 2,17,647 మంది రైతులకు రూ.1,868 కోట్లు పెట్టుబడి సాయం కింద చెల్లించామని మంత్రి తెలిపారు. ఆయిల్‌పామ్‌ సాగును ప్రోత్సహిస్తున్నామని, గోదాముల సామర్థ్యం, వ్యవసాయ మార్కెట్ల సంఖ్య పెంచామని చెప్పారు. జగిత్యాలలో చల్‌గల్‌ పండ్ల మార్కెట్‌లో భారీషెడ్లు నిర్మించుకున్నామని, 71 క్లస్టర్లలో రైతువేదికలు నిర్మించి వ్యవసాయ విస్తీర్ణాధికారులను నియమించామని పేర్కొన్నారు.

విద్యుత్‌ రంగంలో అగ్రస్థానం..

- జిల్లాలో ఏటా రూ.605 కోట్లు వెచ్చించి 1,34,619 వ్యవసాయ బావులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో 232 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని అన్నారు. సౌభాగ్య స్కీం కింద 4,140 గృహ సర్వీసులు, 71 రైతువేదికలకు విద్యుత్‌ సదుపాయం కల్పించామన్నారు. 2,600 మంది నాయిబ్రాహ్మణులు, 1,726 మంది రజక వృత్తుల వారికి 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ ఇస్తున్నామని మంత్రి కొప్పుల ఈశ్వర్‌ అన్నారు. అన్నారు.



త్రివర్ణ పతాకం ఆవిష్కరించాక వందనం చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్‌ తదితరులు

జలసిరులు..

- ఆయకట్టు స్థిరీకరణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పునర్జీవన పథకం ద్వారా సుమారు 4.50 లక్షల ఎకరాలకు రోజూ ఒక టీఎంసీ సరఫరా చేస్తున్నామని కొప్పుల తెలిపారు. రూ.76కోట్ల వ్యయంతో చేపట్టిన బీర్‌పూర్‌ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు చివరిదశకు చేరిందని అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ముంపు బాధితుల కోసం ప్రత్యేకంగా జీవో విడుదల చేయించామని తెలిపారు. మిషన్‌ కాకతీయ ద్వారా రూ.67.30కోట్లు వెచ్చించి 263 చెరువులు పునరుద్ధరించామని, రూ.91 కోట్ల వ్యయంతో 35 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టామని అన్నారు.

ఆహార భద్రతలో..

- ఆహారభద్రత ద్వారా 3,07,609 కుటుంబాల్లోని 8,85,619 మందికి చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నామని మంత్రి అన్నారు. జిల్లాలో 413 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. మిషన్‌ భగీరథ ద్వారా రూ.1,430 కోట్లతో 497 ఆవాసాల్లోని 9.88 లక్షల జనాభాకు సురక్షిత తాగునీరు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

పేదలకు ఇళ్లు..

- జిల్లాలో ఇప్పటివరకు 8,772 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా, ఇందులో 4,715 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి చెప్పారు. సొంతజాగా ఉంటే ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3లక్షల సాయం చేసే గృహలక్ష్మి త్వరలో ప్రారంభమవుతుందని అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్‌

పకడ్బందీగా హరితహారం..

- జిల్లాలో ఇప్పటివరకు 8 విడతల్లో 7.56 కోట్ల మొక్కలను హరితహారం ద్వారా నాటించామని కొప్పుల ఈశ్వర్‌ తెలిపారు. వెయ్యి హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు పునరుద్ధరణకు ప్రతిపాదించామని వెల్లడించారు.

అర్హులకు పింఛన్లు..

- జిల్లాలో అర్హులైన 2,28,351 మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బోదకాల బాధితులు, ఒంటరి మహిళలకు ప్రతినెలా రూ.47.77 కోట్లు పింఛన్ల కింద పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళల కోసం వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. కల్యాణలక్ష్మి ద్వారా 34,275 మంది, షాదీముబారక్‌ ద్వారా 3,760 మందికి సాయం అందించామని అన్నారు.

వైద్యరంగంలో..

- జిల్లాలో రూ.510 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటు చేశామని, 100 పడకల మాతా శిశు కేంద్రం, మెట్‌పల్లి, ధర్మపురిలో 50 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు జిల్లా కేంద్రంలో రాష్ట్రీయ బాల్య స్వస్థ ద్వారా 10 మొబైల్‌ టీంలతో చిన్నారుల్లో 40 రకాల వ్యాధులు గుర్తిస్తూ చికిత్స అందిస్తున్నామని చెప్పారు. కొత్తగా మూడు డయాలసిస్‌ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు.

ఆరోగ్య మహిళ.. కంటి వెలుగు..

- జిల్లాలో రెండోదశ కంటివెలుగు ద్వారా 6,03,641 మందిని పరీక్షించి 75,358 రీడింగ్‌ అద్దాలు, 88,308 ప్రిస్కిప్షన్‌ కంటి అద్దాలు అందించామని మంత్రి అన్నారు. ఆరోగ్య మహిళ ద్వారా 5,714 మంది మహిళలకు పరీక్షించి 303 మందిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి రెఫర్‌ చేశామన్నారు.

రోడ్ల అభివృద్ధి..

- జిల్లాలో రూ.688.80 కోట్లతో రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. దళితబంధు ద్వారా 345 మందికి ఆర్థిక సాయం అందించామన్నారు. అంబేడ్కర్‌ ఓవర్సీస్‌ విద్యానిధి ద్వారా 12 మంది విద్యార్థులకు రూ.20లక్షల సాయం అందించామని, గురుకులాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. మైనార్టీ సంక్షేమం ద్వారా 5 గురుకుల పాఠశాలలు, 3,200 సీట్ల సామర్థ్యంతో రెసిడెన్షియల్‌ జూనియర్‌ కళాశాలలుగా అప్‌గ్రేడ్‌ చేశామని అన్నారు. రెండోవిడత గొర్రెల పంపిణీ, గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ త్వరలో చేపడతామని అన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి రూ.116కోట్ల వ్యయంతో మన ఊరు.. మనబడి పనులు చేపట్టామని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమంలో తొమ్మిదో తరగతి విద్యాబోధన ప్రారంభిస్తామని వెల్లడించారు.

ధరణితో మేలు..

- ధరణి పోర్టల్‌ ద్వారా ఫిర్యాదులు, పెండింగ్‌ మ్యుటేషన్లు, కోర్టు కేసులు సహా 20,414 దరఖాస్తులకు పరిష్కారం చూపించామని మంత్రి తెలిపారు. ఎస్పీ భాస్కర్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ దావ వసంత, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ చంద్రశేఖర్‌గౌడ్‌, డీసీఎంఎస్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లత, మకరంద్‌, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోరుట్లలో..

- కోరుట్ల: స్థానిక పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్‌సీసీ పరేడ్‌ ఆకట్టుకుంది. ప్రముఖులు పాల్గొన్నారు.



వేదికపై మంత్రి కొప్పుల ఈశ్వర్‌, ఎమ్మెల్యే సంజయ్‌, అదనపు కలెక్టర్‌ మకరంద్‌ తదితరులు

మున్సిపాలిటీలు.. ఆలయాల అభివృద్ధి..

- జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, రాయికల్‌, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని కొప్పుల అన్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి ఆలయాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్‌ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.

నెరవేరిన అర్చకుల కల

- నెల వేతనం రూ.10వేలకు పెంపు
- సీఎం కేసీఆర్‌ నిర్ణయంపై హర్షం
- జిల్లాలో 220 ఆలయాలు

కథలాపూర్‌(వేములవాడ): ధూపదీప నైవేద్యం పథకం కింద ఆలయాల్లో దేవుళ్లకు నిత్యపూజలు చేస్తున్న అర్చకులకు చెల్లిస్తున్న నెల వేతనం, ఇతర ఖర్చులు రూ.10వేలకు పెంచుతూ సీఎం కేసీఆర్‌ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని అర్చకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు అర్చకుడి వేతనం రూ.4 వేలు, ఇతర ఖర్చులకు రూ.2 వేలు మొత్తం రూ.6వేలు బ్యాంకు ఖాతాల్లో జమఅయ్యేవి. ఈ మొత్తాన్ని ప్రస్తుతం రూ.10 వేలకు పెరగడంతో కల సాకారమైందని అర్చకులు అంటున్నారు.

జిల్లాలో 220 ఆలయాలు..

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 380 గ్రామాలు ఉన్నాయి.
- గ్రామాలు, పట్టణాల్లో ఆదాయ మార్గాలు లేని ఆలయాలకు వచ్చే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా నిత్యపూజల కోసం ప్రభుత్వం ధూపదీప నైవేద్యం పథకం ప్రవేశపెట్టింది.
- దీనిపరిధిలో 220 ఆలయాలు ఉన్నాయి.
- కానీ, ప్రస్తుతం 189 ఆలయాల్లోని అర్చకులకు ధూపదీప నైవేద్యం పథకం ద్వారా వేతనాలు అందుతున్నట్లు అధికారులు తెలిపారు.
- 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అర్చకులకు చెల్లించే వేతనం, ఇతర ఖర్చులు కలిపి మొత్తం రూ.6వేలకు పెంచారు.
- నిత్యావసరాల ధరలు, దీపాలకు, నైవేద్యాలకు వినియోగించే వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో తమకు వేతనాలు పెంచాలని పలుమార్లు అర్చకులు ప్రభుత్వానికి విన్నవించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

- ఎట్టకేలకు వారి వేతనం, ఇతర ఖర్చుల సొమ్ము పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అర్చకులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నిర్ణయం హర్షణీయం



ధూపదీప నైవేద్యం పథకం కింద అర్చకుల వేతనం, ఇతర ఖర్చులకు రూ.6 వేలు ఇచ్చేవారు. దానిని ఇప్పుడు రూ.10 వేలకు పెంచడం హర్షణీయం. పురాతన దేవాలయాల్లో పూజలు చేసే అర్చకులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలి. అర్చకుల వేతనాలు పెంచినందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు మా కృతజ్ఞతలు.

– ఓరుగంటి మాధవాచార్యులు, అధ్యక్షుడు, ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం

శ్రీవేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచార్యుల మంత్రోచ్చారణలతో లక్ష్మీహవనం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

భిక్షాటన చేశారు.. నిరసన తెలిపారు



భిక్షాటన చేస్తున్న కళాకారులు

రాయికల్‌(జగిత్యాల): తెలంగాణ రాష్ట్రంలో తమకు ఉపాధి కల్పించకచ,దం లేదని ఉద్యమ కళాకారులు శుక్రవారం మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. కళాకారులు గంగాధర్‌నాయక్‌, లింగంపల్లి నరేశ్‌, జంగిలి స్వామి, కుర్సెంగ ప్రసన్నకుమార్‌, సాయిరాజ్‌, రజనీకాంత్‌, మహే శ్‌ స్థానిక అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట భిక్షాటన చేశారు. తెలంగాణ ఉద్యమం ప్రజల్ని తమ ఆటాపాటలతో జాగృతం చేసిన కళాకారులకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కోరారు.

చెరుకు రైతుల గోడు పట్టదా?

- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ మూత
- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి
- పరిశ్రమ ఎదుట నల్లజెండాలతో కాంగ్రెస్‌, చెరుకు రైతుల నిరసన



పరిశ్రమ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మల్లాపూర్‌(కోరుట్ల): నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌ జువ్వాడి కృష్ణారావు ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ముత్యంపేట నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ ఎదుట చెరుకు రైతులు, కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ, 35ఏళ్ల తర్వాత తొలిసారి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిశ్రమ మూతపడడం శోచనీయమన్నారు. తాము అధికారంలోకి వస్తే 100రోజుల్లోనే నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ స్వాధీనం చేసుకుంటామన్న బీఆర్‌ఎస్‌, ఎంపీగా గెలిస్తే సొంత డబ్బు వెచ్చించి ఫ్యాక్టరీ కొనుగోలు చేసి నడుపుతానన్న బీజేపీ ఎంపీ అర్వింద్‌ తమ హామీలు విస్మరించడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి షుగర్‌ ఫ్యాక్టరీలు తెరిపించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్‌ కంది బుచ్చిరెడ్డి, నాయకులు గోరుమంతుల ప్రవీణ్‌, కొమిరెడ్డి లింగారెడ్డి, కొత్తపల్లి రాజరెడ్డి, బెజ్జారపు శ్రీనివాస్‌, అబ్దుల్‌ హఫీజ్‌, కొంతం రాజం, తిరుమల గంగాధర్‌, అల్లూరి సురేందర్‌రెడ్డి, తుపాకుల బాజన్న, రాంప్రసాద్‌, మ్యాకల నర్సయ్య, కంభం సురేశ్‌, చెరుకు రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ కోసం సమగ్ర శిక్షా సిబ్బంది నిరసన

జగిత్యాల: సమగ్ర శిక్షాలోని ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. క్రమబద్ధీకరణ ఏప్రిల్‌ 2023 నుంచి ప్రారంభమవుతుందని మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రకటనను తాము స్వాగతిస్తున్నామన్నారు. కానీ, ఇప్పటికీ అది అమలు కాలేదని అన్నారు. వెంటనే తమను క్రమబద్ధీకరించి కనీస వేతన స్కేలు అమలు చేయాలని, ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని వారు కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

క్లుప్తంగా

విద్యార్థినికి సన్మానం

చందుర్తి(వేములవాడ): మండలంలోని మూడపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి–ప్రభాకర్ దంపతుల కుమార్తె ప్రభావిత ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ చిలుక అంజిబాబు, ప్రధానోపాధ్యాయుడు ప్రతాపనవీన్, యునైటెడ్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి నీరటి శ్రీనివాస్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

6న మెగా జాబ్‌మేళా

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 6న పద్మనాయక కల్యాణ మండపంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్లు దిడ్డి శ్రీనివాస్, గుగ్గిళ్ల జగన్‌గౌడ్ తెలిపారు. 50పైగా కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటాయని, 2016 నుంచి 2023లో పది, ఇంటర్, డిగ్రీ, పీజీలో పాసైన నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99122 31731, 8374768684 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో మద్దికుంట వాసి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మద్దికుంటకు చెందిన సూత్రపు దేవరాజు(36) నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మద్దికుంటకు చెందిన సూత్రపు దేవరాజు నిజామాబాద్ జిల్లా సారంగపూర్‌లో క్షౌరవృత్తిలో స్థిరపడ్డాడు. దేవరాజు బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవరాజు తీవ్రంగా గాయపడగా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. దేవరాజు మృతదేహాన్ని మద్దికుంటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వడదెబ్బతో కూలీ..

వేములవాడ : పట్టణంలో దినసరి కూలీగా పని చేస్తున్న గోనెల శంకర్ (53) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లికి చెందిన శంకర్ వేములవాడలో కూలీ పనికి వెళ్తున్నాడు. శుక్రవారం కూలీ పనికి వచ్చిన శంకర్ కుప్పకూలి పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రూరల్ సెస్ డైరెక్టర్ దేవరాజం, సర్పంచ్ కవిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఆకుల దేవరాజం తెలిపారు. మృతుడికి భార్య తిరుమల, కూతుళ్లు శ్రావ్య, హర్షిణి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: పట్టణ శివారులోని గోవిందుపల్లికి చెందిన మంచాల రాజన్న (63) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మంచాల రాజన్న గతంలో రూ.5 లక్షల వరకు అప్పుచేశాడు. దీంతో అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మోతె గ్రామ శివారులోని చెరువు వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు మంచాల నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు.

బాసర ట్రిపుల్‌ఐటీ పిలుస్తోంది

- 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 19 వరకు గడువు
- 26న తొలి జాబితా విడుదల
- పదోతరగతి పూర్తయిన విద్యార్థులకు సువర్ణావకాశం



బాసర ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం

కరీంనగర్/కోనరావుపేట(వేములవాడ): పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ)లో బీటెక్ చదువుకోవడానికి అవకాశం ఉంది. ఈ మేరకు మే 31న నోటిఫికేషన్ జారీ అయింది. చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తు చేయడం తెలియక ఆందోళన చెందుతుంటారు. కొన్నిసార్లు పొరపాట్లతో సీటు చేజార్చుకుంటారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు విధానం, తేదీలు తదితర వివరాలపై కథనం.

రెగ్యులర్ విద్యార్థులకే..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ డిగ్రీ 2023–24 విద్యాసంవత్సరానికి గాను 1500 సీట్లతోపాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 150 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఎస్సెస్సీ లేదా తత్సమాన పరీక్ష 2023లో రెగ్యులర్ విద్యార్థులు ప్రథమ ప్రయత్నంలోనే ఉత్తీర్ణులై ఉండాలి. 31–12–2023 నాటికి వయసు 18 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 సంవత్సరాలుగా నిర్ణయించారు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

పదోతరగతిలో సాధించిన జీపీఏ (గ్రేడ్ పాయింట్ యావరేజ్), ప్రతీ సబ్జెక్ట్‌లో అభ్యర్థి పొందిన గ్రేడ్ ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్లకు లోబడి ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాలు, ఆర్జీయూకేటీ నిబంధనలను అనుసరించి ప్రవేశాల కోసం నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఆదర్శ పాఠశాలల్లో చదివినవారి జీపీఏకు 0.4 పాయింట్లు కలుపుతారు. రాష్ట్రపతి, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మొత్తం సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకు, మిగతా 15 శాతం అన్‌రిజర్వుడ్ సీట్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. ఈ రెండు రాష్ట్రాల విద్యార్థులే కాకుండా ఇతర రాష్ట్రాల వారికి గ్లోబల్ కేటగిరీ కింద 5 శాతం సీట్లు రిజర్వ్‌గా, గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న భారతీయుల పిల్లలకు 2 శాతం సీట్లు ఉంటాయి. రాష్ట్రపతి ఉత్తర్వులు ఆర్టికల్ 371–డి, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లకు లోబడి అన్ని రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ఎంపిక ప్రక్రియ చేపడుతారు.

దరఖాస్తు చేసుకునే విధానం..

ఈ–సేవ, టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు ఫీజు రూ.500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 450 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల, గ్లోబల్ అభ్యర్థులకు రూ.1,500, ఎన్నారై ఇంటర్నేషనల్ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు చెల్లించాలి. ఒకటి కంటే ఎక్కువ సార్లు దరఖాస్తు చేసుకుంటే చివరగా చేసిన దరఖాస్తును పరిగణలోకి తీసుకుంటారు. హార్డ్ కాపీలను ఈ కింద చిరునామాకు రిజిస్టర్ పోస్ట్‌లో చేయాలి. 'ద డైరెక్టర్, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, బాసర, నిర్మల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, పిన్. 504107'కు పంపాలి. కవర్‌పైన అప్లికేషన్ ఫర్ అడ్మిషన్ 2023 ఆర్జీయూకేటీ బాసర అని రాయాలి.

ముఖ్యమైన తేదీలు..

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ : 19 జూన్ 2023
ఎంపికైన విద్యార్థుల ప్రకటన : 26 జూన్ 2023
కౌన్సెలింగ్ : 1 జూలై నుంచి
పూర్తి వివరాలకు బాసర ట్రిపుల్‌ఐటీ వెబ్‌సైట్ rgukt.ac.in సందర్శించవచ్చు.

కల్పించే సౌకర్యాలు..

ఎంపికైన ప్రతీ విద్యార్థికి ఆరేళ్లపాటు నాణ్యమైన విద్య, ల్యాప్‌టాప్ ఉచితంగా అందిస్తారు. అలాగే ఉచితంగా యూనిఫామ్స్, ఏడాదికి రెండు జతల షూ, హాస్టల్‌లో అన్ని వసతులు కల్పిస్తారు.

దరఖాస్తుతో వీటిని జత చేయాలి..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించిన తర్వాత ప్రింట్ తీసుకొని, ఆన్‌లైన్ ఫీజు రసీదు, పదో తరగతి హాల్‌టికెట్ జిరాక్స్ కాపీ, పదో తరగతి వరకు విద్యా ధ్రువపత్రాలు, ఆన్‌లైన్‌లో తీసిన పదోతరగతి మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థులు(దివ్యాంగులు, ఆర్మీ కుటుంబీకులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ తదితరులు) తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లను దరఖాస్తు ఫాంకు జతచేసి, జూన్ 5 నుంచి 19లోగా అందేలా చూసుకోవాలి. ఎంపికైన సమాచారాన్ని అభ్యర్థులకు పోస్ట్, ఎస్ఎంఎస్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తారు. కౌన్సెలింగ్ సమయంలో అభ్యర్థులు వ్యక్తిగతంగా ఆర్జీయూకేటీ బాసరలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి. సెమిస్టర్ కలుపుకొని సంవత్సర ఫీజు రూ.37 వేలు ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉన్నవారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. తెలంగాణకు సంబంధించిన ఎన్నారైల పిల్లలు ఎంపికైతే ఏడాదికి రూ.1.36 లక్షలు, మిగతా ఎన్నారైలు అయితే రూ.3.01 లక్షలు చెల్లించాలి. ప్రవేశ సమయంలో ఆరోగ్యబీమా ఇతరాలకు సంబంధించి రూ.3,500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.3 వేలు చెల్లించాలి.

సీట్లకు తీవ్రమైన పోటీ..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఉన్న 1,500 సీట్లకు తీవ్రమైన పోటీ ఉంటుంది. గతేడాది దాదాపు 33 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఎంపికకు రిజర్వేషన్లు..

ఎస్సీలకు 15, ఎస్టీలకు 10, బీసీ(ఏ)కు 7, బీసీ(బీ)కి 10, బీసీ(సీ)కి 1, బీసీ(డి)కి 7, బీసీ(ఈ)కి 4, ఈడబ్ల్యూఎస్ వారికి 10, దివ్యాంగులకు 3, సైనిక ఉద్యోగుల పిల్లలకు 2, ఎన్‌సీసీకి 1, స్పోర్ట్స్ కోటా వారికి 0.5, బాలికలకు 33.33 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సుమంత్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం కొండాపూర్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల మండలం కల్లూర్ గ్రామానికి చెందిన సంకె సుమంత్ (24) ఈనెల 1న కొండాపూర్‌లో స్నేహితుడి వివాహానికి హాజరయ్యాడు. శుక్రవారం ఉదయం బైక్‌పై వస్తుండగా కొండాపూర్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి సుమంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. సుమంత్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి వద్ద వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బైక్ అదుపు తప్పి ప్రమాదం జరిగిందా ? లేదా ఏదైనా వాహనం ఢీకొని మృతిచెందాడా అని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

కల్లూరులో విషాదం..

కల్లూర్‌కు చెందిన సంకె నారాయణ– పద్మ దంపతులకు కుమారుడు సుమంత్, కూతురు ఉన్నారు. నారాయణ పదేళ్ల క్రితం మృతిచెందగా కూతురికి అప్పట్లోనే వివాహం జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో నన్ను ఒంటరిగా చేసి వెళ్లిపోయావా కొడుకా అంటూ తల్లి పద్మ రోదించిన తీరు అక్కడివారిని కలిచివేసింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ..



పాలెపు నరేశ్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన పాలెపు నరేశ్ (25) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. నరేశ్ ఈనెల 1న తన అత్తగారి ఊరైన దుంపేట గ్రామానికి వెళ్లి తిరిగి సిరికొండకు బైక్‌పై వస్తున్నాడు. కథలాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్యరోజా, 2 నెలల కూతురు ఉంది. మృతుడి తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

తాగొచ్చి గొడవ పడుతున్నాడని..

- తండ్రిని హత్యచేసిన తనయుడు
- సహకరించిన మరో ఇద్దరు
- కోరుట్ల మండలం సంగెంలో ఘటన.



చిన్న మల్లయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్: తాగొచ్చి ఇంట్లో గొడవపడుతున్నాడని ఓ కుమారుడు తండ్రిని దారుణంగా హత్యచేసిన ఘటన కోరుట్ల మండలం సంగెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన వల్లకొండ చిన్న మల్లయ్య (53)కు భార్య రాజేశ్వరి, కుమారులు పవన్ (23) వంశీ, కూతురు ధరణి ఉన్నారు. పదిహేను ఏళ్లుగా చిన్న మల్లయ్య ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లొస్తున్నాడు. ఆరునెలల క్రితం వచ్చి గ్రామంలోనే ఉంటున్నాడు. పెద్ద కుమారుడు పవన్ కూడా గల్ఫ్‌కు వెళ్లి 20 రోజుల క్రితం రాగా చిన్న కుమారుడు వంశీ గల్ఫ్‌లో ఉన్నాడు. కూతురు ధరణికి వివాహం కావడంతో అత్తవారింట్లో ఉంటోంది.

సహకరించిన ఇద్దరు

చిన్న మల్లయ్య గల్ఫ్ నుంచి వచ్చిన ప్రతిసారి తాగి రాజేశ్వరితోపాటు కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. దీంతో రాజేశ్వరి, పవన్ చెల్లె ధరణి అత్తవారి ఊరైన మేడిపెల్లి మండలం వల్లంపెల్లిలో ఉంటున్నారు. తరచూ తండ్రి గొడవపడుతున్నాడని కక్ష పెంచుకున్న పవన్ దేశాయిపేటకు చెందిన మేనమామ కొడుకు కార్తీక్, బీమారంకు చెందిన స్నేహితుడు శివతో సంగెంలోని చిన్నమల్లయ్య వద్దకు వెళ్లారు. గోడపైనుంచి దూకి అతనితో గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన పవన్ రోకలితో బండతో కొట్టగా చిన్నమల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందించగా పవన్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. పవన్‌కు సహకరించిన శివ, కార్తీక్ పారిపోయారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సంఘటనా స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై సురేశ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. పలువురిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి సోదరుడు వల్లకొండ పెద్ద మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుడిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆరోగ్య ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడు వీరేంద్రపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గాదె అరుణ్‌కుమార్ ఆరోగ్య ఆస్పత్రిలో ఆరునెలల క్రితం శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. వారం రోజులుగా ఇబ్బందిగా అనిపించడంతో గతనెల 24న మళ్లీ ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో అరుణ్‌కుమార్ తీవ్ర అనారోగ్యబారినపడ్డాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే గురువారం తన కుమారుడు మృతిచెందాడని తండ్రి గాదె నందయ్య ఫిర్యాదు మేరకు డాక్టర్ వీరేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈత, తాటిచెట్లు దగ్ధం

కథలాపూర్ (వేములవాడ): బీమారం మండలం కమ్మరిపేట గ్రామ శివారులో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఈత, తాటిచెట్లు కాలిపోయినట్లు గీత కార్మికులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 120 ఈత చెట్లు, 60 తాటి చెట్లు కాలిపోయాయని వారు పేర్కొన్నారు. దీంతో తాము ఉపాధి కోల్పోయామని గీత కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

- రోహిణి కార్తె ప్రారంభంతో దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- ఆయా మండలాల్లో విత్తనాల కొనుగోళ్లు
- జిల్లాలో 4.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసేందుకు అంచనా



కోళ్ల ఎరువును ఎడ్లబండిలో నింపుతున్న రైతు

జగిత్యాల అగ్రికల్చర్: వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గతనెల 25న రోహిణి కార్తె ప్రవేశించడంతో వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి. పొలాల్లో ఎరువులు చల్లడం, పత్తికట్టె తగలబెట్టడం, ట్రాక్టర్‌తో దుక్కులు దున్నడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

ఖరీఫ్‌లో పంటలు వేసేందుకు రైతులు దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. పొలంలో పోసిన ఎరువును చిరుజల్లులు పడిన తర్వాత పొలమంతా చల్లుతారు. అనంతరం నాగలి, లేదా ట్రాక్టర్‌తో దున్నుతారు. దీంతో కలుపు మొక్కలతోపాటు పంటకు హానిచేసే పురుగులు భూమిలో ఉంటే చనిపోతాయి. భారీ వర్షం పడగానే విత్తనాలు వేయనున్నారు. పశువుల ఎరువులు లేని రైతులు గొర్రెల లేదా మేకల మంద పెట్టిస్తున్నారు. ఒక్కరోజుకు మందను బట్టి రూ.2,,000 నుంచి 3,000 వరకు ఉంటుంది.

కూలీల కొరత

ఏడాదంతా పని చేసేందుకు రైతులు కూలీ (పాలేర్లు)లతో ఒప్పందం చేసుకుంటారు. ప్రస్తుతం మగవారికి రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు, ఆడవారికి రూ.50 వేల వరకు ఇస్తున్నారు. గ్రామాల్లో కూలీల కొరత ఉంది. జిల్లాలో 4.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయనుండగా, వరిపంట 3.10 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న, పత్తి, కంది, పెసర తదితర పంటలను మరో లక్ష ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి జనుము, జీలుగ, కంది, పెసర విత్తనాలు ఆయా మండలాల్లోని అగ్రోస్, సింగిల్‌విండో కేంద్రాల నుంచి తీసుకెళ్తున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాల కోసం రైతులు ప్రైవేట్ కంపెనీలపైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది.

ముందుగానే కొనుగోలు..

గతంలో రసాయన ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు ధరలు ఎప్పుడు పెరుగుతాయో, తగ్గుతాయో తెలియని పరిస్థితి. దీంతో రైతులు ముందు జాగ్రత్తగా వానాకాలం సీజన్‌కు సరిపోయే యూరియా, కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకుంటున్నారు.

రుణాలపై సందిగ్ధత

పంట రుణాలపై రైతుల్లో సందిగ్ధత నెలకొంది. రైతులు మే, జూన్‌లో బ్యాంకుల నుంచి పంటరుణాలు తీసుకొని ఏడాదిలోపు రెన్యువల్ చేసుకుంటారు. కానీ, ప్రభుత్వం లక్షలోపు రుణాలను మాఫీ చేస్తానని చెప్పి, కేవలం రూ.25 వేలలోపు, కొంతమందికి రూ.50 వేల రుణాలను మాత్రమే మాఫీ చేశారు. దీంతో రైతులు రుణాల మాఫీకోసం ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు, రైతులు రెగ్యులర్‌గా రుణాలు చెల్లించినప్పటికీ వడ్డీ మాఫీకావడం లేదు. జిల్లాలోని బ్యాంకులకు రూ.2,500 కోట్ల రుణం లక్ష్యంగా నిర్ణయించగా కొత్తగా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు వెనుకంజ వేస్తున్నాయి.

కోడి ఎరువు చల్లాను



వానాకాలం సీజన్ ప్రారంభమైంది. పసుపు వేసే తోటను ఎంబి నాగలితో దున్నించాను. హైదరాబాద్ నుంచి తెప్పించిన కోళ్ల ఎరువును తోట మొత్తం చల్లాను. కల్టివేటర్‌తో కలుపు మొక్కలు లేకుండా దున్నించాను. వర్షం కురిస్తే పసుపు పంట పంట పండించేందుకు సిద్ధం చేశాను.
– తీపిరెడ్డి బాపురెడ్డి, రైతు

పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలి



రోహిణి కార్తె ప్రారంభంతో వానాకాలం సాగు పనులు ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్‌తో దుక్కులు సిద్ధం చేసుకుంటే వర్షపు నీరు నిలవ్వతో పాటు పంటకు హానిచేసే పురుగులు చనిపోతాయి. తొలకరి వర్షాలు పడగానే జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. పశువులు, కోళ్ల ఎరువును పంట భూముల్లో చల్లితే భూమి సారవంతగా ఉంటుంది.
– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధనాస్థానం డైరెక్టర్, పొలాస

షటిల్ ఆడుతూ గుండెపోటుతో మృతి



రాజగంగారాం (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని జగిత్యాల క్లబ్‌లో శుక్రవారం ఉదయం షటిల్ ఆడుతూ బూస వెంకటరాజగంగారాం(53) గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన వెంకటరాజగంగారాం తన స్నేహితులతో కలిసి క్లబ్‌లో షటిల్ ఆడుతున్నాడు. అకస్మాత్తుగా కిందపడిపోవడంతో స్నేహితులు వెంటనే సీపీఆర్ చేశారు. ఆ తర్వాత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి క్లబ్ కార్యదర్శి ముస్కు నారాయణరెడ్డి, సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పోలీసు వాహనాన్ని ఢీకొన్న బైక్

సిరిసిల్ల క్రైం : నిలిచిన ఉన్న వాహనాన్ని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం సిరిసిల్లలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం శ్రీనగర్‌కాలనీకి చెందిన గురువన్న గారి రామారావు స్నేహితుడితో కలిసి సిరిసిల్ల బస్టాండ్ వైపు వెళ్తున్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై ఉన్న కారును ఢీకొట్టారు. అందులో ఉన్నది పోలీసులని గమనించి రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ కారు నిలుపుతారా ? అని ప్రశ్నించారు. పోలీసులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు రోడ్డుపై పార్క్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. సదరు కారు ఓ పోలీసు అధికారి బందోబస్తుకు రావడంతో స్టేషన్ ముందున్న చెట్టుకింద పార్కింగ్ చేసినట్లు స్థానికులు తెలిపారు.